నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 20 ఆగస్టు 2024 | SIDDIPET

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామ పంచాయతీ

అక్కారం అన్నదాతల ఆవేదన

- గ్రామంలో అర్హులకు వర్తించని రుణమాఫీ
- బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్న రైతులు

గజ్వేల్, ఆగస్టు 19: ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు. మూడు విడతలుగా రుణమాఫీ చేసినా, అందులో కూడా అనేక రకాల నిబంధనలు అమలు చేసింది. దీంతో అర్హులైన చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామానికి చెందిన రైతులు ప్రజ్ఞాపూర్‌లోని మంజీరా గ్రామీణ వికాస్ బ్యాంకు, గజ్వేల్‌లోని సహకార బ్యాంకులో వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. రుణా లు తీసుకోవడంతో పాటు ఏటా రుణాలను రెన్యువల్ చేస్తున్నారు. రెండు నెలలుగా ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీలో అర్హులైన చాలా మంది పేరు జాబితాలో రాకపోవడంతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అక్కారం గ్రామంలో మొదటి విడతలో 232 మందికి, రెండో విడతలో 119 మందికి రుణమాఫీ జరిగింది. మూడో విడతలో రూ.2 లక్షల లోపు తీసుకున్న రైతుల్లో కొద్ది మం దికే మాఫీ కావడంతో ఐదు రోజులుగా చాలా మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. గతేడాది వానకాలంలో రుణాలు రెన్యువల్ చేసుకున్నా మాఫీ కాలేదని రైతులు వాపోతున్నారు. ప్రతిరోజూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న సరైన సమాధానం చెప్పడం లేదని వాపోతున్నారు.

నాది మాఫీ కాలేదు..

ప్రజ్ఞాపూర్ మంజీరా గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.1.90లక్షల క్రాప్‌లోన్ తీసుకున్న. రెండు లక్ష లోపు రుణమాఫీలో నా పేరు రాలేదు. రెండు లక్షలపై బడిన డబ్బులుంటే రెన్యువల్ చేశా. అయినా నాకు రుణమాఫీ కాలేదు. అదే బ్యాంకులో నా భార్య బాలమణి పేరుమీద రూ.20 వేలు క్రాప్‌లోన్ తీసుకున్నా. మాఇద్దరిలో ఎవరికి రుణమాఫీ కాలేదు. తక్కువ డబ్బులు తీసుకున్న నాభార్య పేరుమీదైన రుణమాఫీ కాలేదు. కుటుంబలో ఒక్కరికైనా అవకాశం వస్తే సంతోషించే వాళ్లం. ప్రభుత్వ ని బంధనలతో చాలా నష్టపోతున్నాం.

– గుండబోయిన మల్లేశం, రైతు, అక్కారం, గజ్వేల్ మండలం

మా ఇంట్లో ఎవరికీ రుణమాఫీ కాలేదు..

ఇంట్లో నాతోపాటు ఇద్దరు కొడుకులు బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నాం. ప్రభుత్వం మూడు విడతలుగా చేసిన రుణమాఫీలో మా ఇంట్లో ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. నాపేరు మీద రూ.50 వేలు, పెద్దోడు శంకర్‌గౌడ్‌పై రూ.81వేలు, చిన్నోడు బాబుగౌడ్ మీద రూ.71వేలు ప్రజ్ఞాపూర్ బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నాం. మా కుటుంబంలో ఒక్కరికైన మాఫీ చేయలేదు. ప్రభుత్వం అలా చేయడం బాగాలేదు. నాలా చాలామంది రైతులకు రుణమాఫీ కాక ఇబ్బంది పడుతున్నారు.

– బైరి రామాగౌడ్, రైతు, అక్కారం, గజ్వేల్ మండలం

లోన్ పైసలు ఎప్పుడూ మాఫీ కాలే..

నేను వ్యవసాయం చేస్తున్నప్పటి నుంచి బ్యాంకులో తీసుకున్న క్రాప్‌లోన్ ఎన్నడూ మాఫీ కాలేదు. నా పేరు మీద రూ.1.60లక్షలు, నా భార్య పేరుమీద రూ.60 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. కొద్ది రోజుల క్రితమే బ్యాంకులో తీసుకున్న అసలు కు రూ.30వేల మిత్తి కట్టి రెన్యువల్ చేసుకున్న. అయినా రుణమాఫీ కాలేదు. అధికారులను ఎవరిని అడిగినా న్యాయం జరగడం లేదు. బ్యాంకులో అడిగితే వస్తే ఇస్తామని చెప్పుతున్నారు. ప్రభుత్వం నాలాం టి రైతులకు న్యాయం చేయాలి.

–మంద యాదయ్య, అక్కారం, గజ్వేల్ మండలం

ఎత్తిపోతల ద్వారా మల్లన్న సాగర్‌లో చేరిన గోదావరి జలాలు

నిలిచిన గోదావరి జలాల ఎత్తిపోతలు

తొగుట, ఆగస్టు 19: సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్‌లో 10 రోజులుగా కొనసాగిన గోదావరి జలాల ఎత్తిపోతలు సోమవారంతో నిలిచిపోయాయి. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేయడంతో ఆగస్టు 8న రంగనాయక సాగర్ నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని విడుదల చేశారు. సోమవారం వరకు 10 రోజులపాటు ఎత్తిపోతల ద్వారా మల్లన్న సాగర్‌కు 4.25 టీఎంసీలు నీళ్లు పంపింగ్ చేశారు. అంతకు ముందు మల్లన్న సాగర్‌లో 8.5 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఎత్తిపోతలతో 4.25 టీఎంసీల నీళ్లు రాగా, మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు 2.70 టీఎంసీల నీటిని తరలించారు. నేడు మల్లన్నసాగర్‌లో 10.10 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. 2020 నుంచి మల్లన్నసాగర్‌లోకి ఇప్పటి వరకు 45.60 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. యాసంగి సాగునీటి అవసరాల కోసం వినియోగించనున్నారు. గతంలో మల్లన్నసాగర్‌లో 15 టీఎంసీల నీటిని నిల్వ చేయగా, ప్రస్తుతం 10.10 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేశారు. మల్లన్నసాగర్‌లో 20 టీఎంసీల వరకు నీటిని నిల్వచేస్తే కరువు సమయంలో ఉపయోగపడే అవకాశం ఉందని జిల్లా రైతులు పేర్కొంటున్నారు.

కలలు..కల్లలాయే

- కొడుకు దూరమాయే..అప్పులే మిగిలే
- అమెరికాలో అనుమానాస్పద స్థితిలో కూటిగల్ విద్యార్థి మృతి
- అప్పులు చేసి ఉన్నత చదువులకు పంపిన తల్లిదండ్రులు
- అకాల మరణంతో పుట్టెడు దు:ఖంలో కుటుంబం
- వేధిస్తున్న అప్పులు.. ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని వేడుకోలు


సాయిరోహిత్ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 19: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన తుషాలపురం మంగ-మహదేవ్ దంపతులు ఉపాధి కోసం 20 ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి సాయిరోహిత్, సాయినిఖిల్, సాయి నిఖిత ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు సాయిరోహిత్(23) హైదరాబాద్‌లోని సీవీఆర్ కాలేజీలో 2022లో బీటెక్ పూర్తిచేశాడు. ఎంఎస్ రెక్కాడితేగాని డొక్కాడని పేద కుటుంబం వారిది. కొడుకు అమెరికాలో ఉన్నత చదువులు చదువుతానని చెబితే అప్పులు చేసి కొడుకును అమెరికాకు పంపారు. బాగా చదువుకొని అమెరికాలో పెద్ద ఉద్యోగం సాధించి కుటుంబాన్ని పోషిస్తాడని కలలు కన్న ఆ తల్లిదండ్రుల కలలు కల్లలయ్యాయి. చెట్టంత కొడుకు దేశంకాని దేశంలో చనిపోవడంతో ఆ దంపతులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. ఓవైపు కొడుకు దూరమయ్యాడనే విషాదం నుంచి కోలుకోకముందే, కొడుకు కోసం చేసిన అప్పులు వారిని మరింతగా ఆందోళనకు గురిచేస్తున్నాయి. చేసిన అప్పులు తీరే మార్గం లేక మిగతా ఇద్దరు పిల్లలను పోషించే పరిస్థితులు లేక ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, దాతలను వేడుకుంటున్నారు.

చదివేందుకు 2023 డిసెంబర్‌లో అమెరికాలోని సియోటెల్‌కు వెళ్లాడు. కొడుకు చదువు కోసం తల్లిదండ్రులు రూ. 30 లక్షల అప్పు చేశారు. ఈ ఏడాది జూలై 22న అమెరికాలో అదృశ్యమమైన సాయిరోహిత్ జూలై 24న విగతజీవిగా దొరికాడు. పదిహేను రోజుల తర్వాత ఈనెల 6న సాయిరోహిత్ మృతదేహం అమెరికా నుంచి కూటిగల్‌కు చేరుకుంది. స్వగ్రామంలోనే అంత్యక్రియలు పూర్తి చేశారు. సాయిరోహిత్ మృతదేహాన్ని అమెరికా నుంచి కూటిగల్‌కు తెప్పించేందుకు మరో రూ. 10లక్షల అప్పు అయ్యింది. చెట్టంత కొడుకు దూరం కాగా, అప్పులు వేధిస్తున్నాయి. అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సాయిరోహిత్ కేసును అక్కడి పోలీసులు నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, విచారణకు తెలంగాణ ప్రభుత్వం సహకరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూరులో రైతు రుణమాఫీ వర్తించకపోవడంతో సోమవారం రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న రైతులు

కర్షకలోకం కన్నెర్ర!

- సర్కారు తీరుపై భగ్గుమంటున్న రైతులు
- కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని ఆవేదన
- రేవంత్‌రెడ్డి తీరును ఎండగడుతూ రోడ్డెక్కుతున్న రైతులు
- పలు గ్రామాల్లో సీఎం దిష్టిబొమ్మల దహనం
- బ్యాంకుల ఎదుట నిరసనలు తెలుపుతున్న అన్నదాతలు
- ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,32,098 మంది రైతులకు వర్తించని రుణమాఫీ

సిద్దిపేట, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రస్తుతం వానకాలం వ్యవసాయ పనుల్లో బిజీగా గడపాల్సిన రైతులు రోడ్డెక్కుతున్నారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడుతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రెండు రోజులుగా నిరసనలు చేపడుతున్నారు. మూడు విడతల్లో రైతులకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఏ గ్రామంలో చూసినా 50శాతం మందికి రుణాలు మాఫీ కాలేదని స్వయంగా రైతులే చెబుతున్నారు. రుణమాఫీ ఎగ్గొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొర్రీలు పెట్టి సగం మంది రైతులను రుణమాఫీకి దూరం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి మొండిచెయ్యి చూపిందని వారు ఆరోపిస్తున్నారు. రెండు విడతల్లోనే చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మూడో విడత రుణమాఫీని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రకటించినప్పటికీ అంతా గందరగోళంగా ఉంది.

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూరులో రుణమాఫీ కాకపాయే అని మాట్లాడుకుంటున్న రైతులు

ఉమ్మడి జిల్లాలో లక్ష మంది రైతులకు మొండిచెయ్యి

ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులకు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చెయ్యి చూపుతోంది. రైతుల సంఖ్యకు రుణమాఫీ లెక్కలకు పొంతన లేకుండా పోయింది.లక్ష రూపాయల వరకు ఒకసారి, లక్షన్నర వరకు రెండోసారి, రెండు లక్షల వరకు మూడోసారి రుణమాఫీ చేస్తున్నట్లు ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసింది. అప్పటి ఇప్పటి లెక్కలకు చూసుకుంటే రుణమాఫీ రైతుల సంఖ్యను కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా తగ్గించింది. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తే రైతుల సంఖ్య పెరగాలి కానీ తగ్గింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసినప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 4,17,591 మందికి రుణమాఫీ జరిగింది. 2014లో ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,50,000 మంది రైతులకు రూ.398 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మాఫీ చేసింది. 2018లో సిద్దిపేట జిల్లాలో 81,565 మందికి రూ. 418 కోట్లు, మెదక్ జిల్లాలో 73,026 మందికి రూ. 366.39 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 1,13,000 మందికి రూ. 678 కోట్లు మాఫీ చేసింది. బీఆర్ఎస్ హయాంలో లక్ష రూపాయల్లోపు రుణమాఫీ జరిగింది. మొత్తంగా 4,17,591 మందికి రూ. 1,860.39 కోట్లు రుణమాఫీ చేసి బీఆర్ఎస్ రైతు ప్రభుత్వం అని నిరూపించుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసినట్లు చెప్పుకుంటున్నది. కానీ, వీరు చేసింది ఎంతంటే 2,85,493 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు. ప్రభుత్వం 1,32,098 మంది రైతులకు కోత పెట్టింది. రైతుల సంఖ్య పెరగాల్సి ఉండగా, భారీగా తగ్గించింది. దీంతో గ్రామాల్లో 50శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదు. దీంతో ప్రభుత్వతీరుపై రైతులు రగిలిపోతున్నారు.

గ్రామాల్లో నిరసనలు, రాస్తారోకోలు

రుణమాఫీపై ఉమ్మడి జిల్లాలోని గ్రామాల్లో నిరసనలు, రాస్తారోకోలు, సీఎం దిష్టిబొమ్మల దహనాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఓపిక పట్టిన రైతలకు నిరాశే మిగలడంతో వారిలో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మూడో విడతల్లో అయినా తమకు రుణమాఫీ కాకపోదేమో అని అనుకున్న రైతులు, చివరి విడతలో కూడా ప్రభుత్వం మొండిచేయి చూపడంతో రగిలిపోతున్నారు. మూడో విడత ప్రకటన తర్వాత ఎక్కడ చూసినా ప్రభుత్వ తీరుపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఏవేవో కారణాలు చెప్పి ప్రభుత్వం రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మకు రైతులు శవయాత్ర నిర్వహించి గ్రామ కూడలిలో దహనం చేశారు. చాలాగ్రామాల్లో నిరసనలు చేపట్టారు. అక్కన్నపేట మండలంలోని కట్కూరు గ్రామంలో రైతులు బ్యాంకుల ఎదుట నిరసన తెలిపారు. ఇలా ప్రతిరోజు నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

సిద్దిపేట జిల్లా అక్కెనపల్లిలో సీఎం దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న రైతులు

అక్కెనపల్లిలో రోడ్డెక్కిన రైతులు

నంగునూరు, ఆగస్టు 19: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో సోమవారం రైతులు రోడ్డెక్కారు. తమకు రూణమాఫీ కాలేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు గ్రామంలో శవయాత్ర నిర్వహించారు. అనంతరం సీఎం డౌన్ డౌన్ అంటూ నివాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామంలో 500 మందికి పైగా రైతులు రుణాలు తీసుకుంటే కేవలం 40శాతం మందికి రుణమాఫీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా రైతులకు తక్షణమే రుణమాఫీ చేయాలంటూ డిమాండ్ చేశారు.

గుట్టకిందిపల్లి రైతుల గోస

- గ్రామంలో 40 మందికి వర్తించని రుణమాఫీ
- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామ రైతులు

మెదక్ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గుట్టకిందిపల్లి రైతులు

మెదక్, ఆగస్టు 19 (నమస్తేతెలంగాణ): అర్హతలున్నా రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని మెదక్ మండలం గుట్టకిందిపల్లి గ్రామ రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు అన్ని అర్హతలున్నా రుణమాఫీ వర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులో పేరు లేదని రుణమాఫీ వర్తించలేదని రైతు నిమ్మల శేఖయ్య ఆరోపించారు. అన్ని అర్హతలున్నా తనకు రుణమాఫీ రాలేదని, తాను రూ.48,230 లోన్ తీసుకున్నానని, అయినా మాఫీ కాలేదని రైతు పిట్ల రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా పలువురు రైతులు రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్నామని, తమకు అన్ని అర్హతలున్నా మాఫీ ఎందుకు వర్తించలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మూడో విడతలోనైనా తమ పేర్లు జాబితాలో ఉంటాయని అనుకుంటే రాలేదని పేర్కొన్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరిగినా లాభం లేకుండా పోయిందన్నారు. ప్రతి రోజూ బ్యాంక్ వద్దకు వచ్చి పడిగాపులు కాస్తున్నామని, అయినా ఎవరూ సమాధానం చెప్పడం లేదన్నారు. వ్యవసాయ అధికారులు సమాధానం చెప్పడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, తమను చీదరించుకుంటున్నారని వాపోయారు. మెదక్ మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదని, తమ బాధ ఎవరికీ చెప్పుకోవాలో తెలియక ప్రజావాణిలో చెప్పుకోవడానికి వచ్చామని కలెక్టర్‌తో గుట్టకిందపల్లి గ్రామ రైతులు మొరపెట్టుకున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ గ్రామానికి చెందిన 40 మంది రైతులకు వర్తించలేదన్నారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

రేషన్‌కార్డులో పేరు లేదని మాఫీ కాలేదట..

రేషన్ కార్డులో పేరు లేదని నాకు రుణమాఫీ కాలేదు. మెదక్‌లోని ఏపీజీవీబీలో రూ.29, 158 క్రాప్ లోన్ తీసుకున్న. మొదటి విడతలో నాకు మాఫీ రాలేదు. అర్హత ఉన్నప్పటికీ నాకు రుణమాఫీ కాలేదు. దీనిపై అధికారులను అడిగితే రేషన్ కార్డులో పేరు లేనందున మాఫీ కాలేదని చెబుతున్నారు. నేను తీసుకున్న అప్పుకు రెన్యువల్ చేశా. బ్యాంకుకు వెళ్లి చూస్తే జాబితాలో నా పేరు లేదు. సర్కారు నాకు న్యాయం చేయాలి.

– నిమ్మల శేఖయ్య, రైతు, గుట్టకిందిపల్లి, మెదక్ మండలం

ఇదెక్కడి న్యాయం..

రూ.2 లక్షల పైన ఉన్నందున నాకు రుణమాఫీ కాలేదు. నాపేరు మీద రూ.1.98 లక్షలు ఉంది. నా భార్య పేరు మీద రూ.43,550 లోన్ ఉంది. నాకు మూడో విడతలో రూ. 2 లక్షల రుణమాఫీ వర్తించలేదు. ఇదెక్కడి న్యాయం. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పు తీసుకున్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పింది. ఇప్పుడేమో భార్యాభర్తలకు రూ.2 లక్షలకు పైన ఉన్నందున మాఫీ రాలేదని అధికారులు చెబుతున్నారు. నాకు న్యాయం చేయాలి.

– ఎలిగడి గంగయ్య, రైతు, గుట్టకిందిపల్లి, మెదక్ మండలం

నిండుకుండలా నారింజ ప్రాజెక్టు

సంగారెడ్డి జిల్లా కొత్తూరు-బిలోని నారింజ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి వరద వస్తుండడంతో గేట్లపై నుంచి దిగువకు జలాలు వెళ్తున్నాయి. వరద వస్తుండడంతో ప్రాజెక్టు పరిధిలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ అధికారులు సూచించారు. నారింజ ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో సాగుకు ఢోకాలేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– న్యాల్‌కల్, ఆగస్టు 19

సంగారెడ్డి ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

రుణమాఫీపై ఫిర్యాదుల వెల్లువ

- సంగారెడ్డి జిల్లాలో 5వేల ఫిర్యాదులు
- నోడల్ అధికారులను నియమించిన ప్రభుత్వం
- వారికి యాప్ అందజేత.. రోజువారీగా ఫిర్యాదులు అప్‌లోడ్‌కు ఆదేశం
- సరిగా పనిచేయని యాప్.. ఇబ్బందుల్లో నోడల్ అధికారులు
- రుణమాఫీలో లోపాలపై రైతుల్లో పెరుగుతున్న ఆగ్రహం

సంగారెడ్డి, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ): రకరకాల కారణాలు పెట్టి సర్కారు తమ పంట రుణాలు మాఫీ చేయకపోవడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు రగిలిపోతున్నారు. దీనిపై మండల, జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. సోమవారం రైతులు పెద్దసంఖ్యలో సంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చి ప్రజావాణిలో కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నారు. బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ రైతులు నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5వేల మందికిపైగా రైతులు అధికారికంగా రుణమాఫీ కాలేదంటూ ఫిర్యాదు చేశారు. రుణమాఫీపై రోజురోజుకు ఫిర్యాదులు పెరుగుతుండడంతో ప్రభుత్వం మండలాల వారీగా సంగారెడ్డి జిల్లాలో 27 మంది మండల వ్యవసాయ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించి వారికి ప్రత్యేకంగా యాప్ ఇచ్చింది. రుణమాఫీపై వచ్చే ఫిర్యాదులను యాప్‌లో రోజువారీగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నోడల్ అధికారులకు ఇచ్చిన యాప్ సరిగా పనిచేయడం లేదని తెలిసింది.

కాశీపూర్ రైతుల గోస ...

కంది మండలం కాశీపూర్‌లో రైతులు రుణమాఫీ అమలు కాక ఇక్కట్లు పడుతున్నారు. 2వేల జనాభా ఉన్న కాశీపూర్‌లో 1200 ఎకరాల సాగు భూమి ఉంది. 300 మందికి పైగా రైతులు ఉన్నారు. కందిలోని ఎస్‌బీఐ, డీసీసీబీ బ్యాంకులో గ్రామంలోని 200 మందికిపైగా రైతులు పంటరుణాలు తీసుకున్నారు. గ్రామంలో అధికశాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రేవంత్ సర్కార్‌పై వారు మండిపడుతున్నారు.

రూ.50వేల రుణమాఫీ చేయలేదు

కాశీపూర్‌లోని నాకున్న ఎకరం పొలంపై రూ.42 వేల పంట రుణం తీసుకున్నా. ఇప్పుడు వడ్డీతో కలిపి పంట రుణం రూ. 50వేలు దాటింది. నాకు తెల్లరేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం ఉంది. రుణమాఫీకి వందశాతం అర్హత ఉంది. అయినా రూ.50 వేల పంట రుణం మాఫీ కాలేదు. ప్రభుత్వం వెంటనే మాఫీ చేయాలని కోరుతున్నా.

– మల్లమ్మ, రైతు, కాశీపూర్

ఫార్మాసిటీని ప్రభుత్వం విరమించుకోవాలి

అధికారులకు వినతిపత్రం అందజేసిన రైతులు

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ తహసీల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భూబాధితులు, ప్రజలు

న్యాల్‌కల్, ఆగస్టు 19: తమకు తీవ్రంగా నష్టం చేకూర్చే ఫార్మాసిటీ ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాలకు చెందిన భూబాధితులు, ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం న్యాల్‌కల్ తహసీల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, భూబాధితులు, ప్రజలు కలిసి అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆనంతరం వారు మాట్లాడుతూ.. తమ గ్రామాల పరిధిలో 2వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేసేందుకు గుట్టుచప్పుడు కాకుండా అధికారులు చేస్తున్న భూసర్వే వెంటనే నిలిపివేయాలన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో భూములు, ఉపాధి కోల్పోవడంతో కాలుష్యంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా తాము భయపడేదిలేదని, ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటు ఆలోచనను వెంటనే విరమించుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, మారుతీయాదవ్, ఓంకార్ యాదవ్, శ్రీపతి, నాగన్న, రవిగౌడ్, శివరాజ్, రవి, మల్లేశం, నరేందర్‌రెడ్డి, ఖదీర్, శివకుమార్, వీరన్న, నాగప్ప, మల్లప్ప, పాండు, కార్తీక్, అర్జున్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ గౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.